క్లుప్తంగా

మోటర్లు చోరీ కాకుండా చర్యలు చేపట్టాలి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో విద్యుత్ మోటర్లు అపహరణకు గురికాకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని రైతు సంఘం నాయకులు కోరారు. కుంచనపల్లిలోని పంట పొలాల్లో ఉన్న వ్యవసాయ విద్యుత్ మోటర్లు అపహరణకు గురైన విషయం విదితమే. బాధిత రైతులను రైతు సంఘం నాయకులు సోమవారం కలసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతు సంఘం జిల్లా నాయకులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ కుంచనపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు రైతుల వ్యవసాయ విద్యుత్ మోటర్లు చోరీకి గురి అయ్యాయని, అసలే పండించిన పంటలకు గిట్టుబాటు ధర రాకపోగా, కష్టాల్లో ఉన్న రైతుల విద్యుత్ మోటర్లు చోరీ చేయడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, రైతు నాయకులు అమ్మిశెట్టి రంగారావు, అమ్మిశెట్టి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

తోపుడు బండ్లు అందజేత



తోపుడు బండ్లు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మంగళగిరి: ఇరువురు నిరుపేదలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తోపుడు బండ్లు అందజేశారు. నగరంలోని కొత్తపేటకు చెందిన ఆర్దల వెంకట శివరావు, నవులూరు ఎంఎస్ఎస్ కాలనీకి చెందిన కొణతాల సామ్రాజ్యంలకు తోపుడు బండ్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు బొమ్మి శివరామిరెడ్డి, ఎండీ ఫిరోజ్, దొడ్డక కృష్ణ, తాడిబోయిన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డుకు శంకుస్థాపన

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి రూరల్ పెనుమాకలో బీటీ రోడ్డు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ పెనుమాక, యర్రబాలెం రోడ్డులోని కరణంగారి మామిడి తోట నుంచి యర్రబాలెం, కృష్ణాయపాలెం రోడ్డు వరకు నగర పాలక సంస్థ ప్రత్యేక నిధులు రూ.కోటీ 15 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టామని తెలిపారు. రాధారంగా నగర్‌లో నిర్మించిన టిడ్కో నివాసాలకు వెళ్లేందుకు మార్గం సులువుగా ఉంటుందని అన్నారు. రెండు నెలల వ్యవధిలో రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని డీఈ తెలిపారు.

యర్రబాలెం సచివాలయంలో ఆధార్ సేవలు

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం ఒకటో సచివాలయంలో సోమవారం నుంచి ఆధార్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ జగన్మోహనరావు ఆధ్వర్యంలో ఆధార్ కేంద్రం నిర్వహించనున్నారు. చంటి పిల్లలకు నూతన ఆధార్ కార్డులు, పెద్ద వారికి వేలిముద్రలు, ఫొటోలు అప్‌డేట్ చేయడంతోపాటు పేరులోని లోపాలను సరిచేయనున్నారు. పుట్టిన తేదీ, పేరులోని లోపాల అప్‌డేట్‌కు సంబంధిత వ్యక్తులు తమకు సంబంధించిన ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను తమ వెంట తీసుకు రావాల్సి ఉందని డిజిటల్ అసిస్టెంట్ తెలిపారు.

వైభవంగా శీతల యంత్ర వార్షికోత్సవం



ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని శీతల యంత్ర, పోలేరమ్మ ఆలయ, విఘ్నేశ్వరస్వామి, నవగ్రహ మండపాల 18వ వార్షికోత్సవం సోమవారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే శీతల యంత్రానికి మహిళలు బిందెలతో నీటిని పోసి అభిషేకాలు చేసి పసుపు, కుంకుమలతో అలంకరించి పూజలు చేశారు. పొంగళ్లు పొంగించి పోలేరమ్మ ఆలయం, విఘ్నేశ్వరుడి ఆలయం, నవగ్రహమండపాల వద్ద నివేదనలు పెట్టారు. మధ్యాహ్నం భక్తులకు గ్రామస్తుల సహకారంతో అన్నదానం చేశారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

తెనాలిరూరల్: పట్టణానికి చెందిన న్యాయవాది షేక్ ఖాదర్ హుస్సేన్‌పై బాపట్ల జిల్లా కొల్లూరు మండలం పెసర్లంక గ్రామంలో దాడి చేయడాన్ని నిరసిస్తూ తెనాలి బార్ అసోసియేషన్ న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. కోర్టు ఆఫీసర్లుగా వెళ్లిన న్యాయవాదులు ఎంఎల్ జగదీశ్వరం బ, షేక్ ఖాదర్ హుస్సేన్‌ను దుర్భాషలాడడమే కాకుండా ఖాదర్ హుస్సేన్‌పై దాడి చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. విధులు బహిష్కరించారు. కోర్టు ప్రాంగణం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావు, కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, తాడిబోయిన శ్రీనివాసరావు, షేక్ ఖాదర్ హుస్సేన్, సోలాశంకర్ తదితర న్యాయవాదులు నిరసనలో పాల్గొన్నారు.

పేదల వ్యతిరేకి చంద్రబాబు

- వైఎస్సార్ సీపీ నాయకులు
- చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం



సొలస బస్టాండ్ సెంటర్లో చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఫిరంగిపురం: పేద ప్రజల వ్యతిరేకి చంద్రబాబునాయుడు అని జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. రాజధాని ప్రాంతంలో యాభైవేల మంది పేదప్రజలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడాన్ని అడ్డుకోవాలని చూసిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు విధానాన్ని నిరసిస్తూ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సోమవారం పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి ర్యాలీగా సొలస బస్టాండు సెంటర్ వరకు వెళ్లి ప్రధాన రహదారిపై చంద్రబాబునాయుడు దిష్టిబొమ్మను దహనం చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు కత్తిరేణమ్మ మాట్లాడుతూ ఇళ్లు లేని పేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్లస్థలాలు కేటాయిస్తే సెంటు స్థలాన్ని శ్మశానవాటికలతో పోల్చడం చంద్రబాబుకు తగదని చెప్పారు. పేదలైన వారు నివాసం ఉంటేందుకు సెంటు స్థలం అయినా చాలుతుందన్నారు. పేదలకు ఇస్తున్న స్థలాలు విషయంలో తన సొంతసొత్తు పోతుందనట్లుగా చంద్రబాబు ప్రవర్తించి వ్యతిరేకించడం దుర్మార్గమని తెలిపారు. పలువురు నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, పి.జేమ్స్ ఇన్నయ్య, చిట్టా అంజిరెడ్డి, వైస్ ఎంపీపీ జి.చంద్రం, సర్పంచులు మేడా బాబు, డి.మెల్కియా, చుక్కా రూతు, వి.వీరయ్య, చుక్కా శాంతమ్మ, ఎం.సుధాకరరెడ్డి, ఎం.ఈశ్వరరెడ్డి, టి.కృష్ణ, చేవూరి రామమోహన్‌రెడ్డి, ఖాజావలి, కె.శ్రీనివాసరెడ్డి, ఎస్.చిన్నప్ప, ప్రకాశరావు, మౌలాలి, సుభాని, మస్తాన్‌వలి, తిరుపతిరెడ్డి, పుల్లయ్య, పిచ్చిరెడ్డి, వెంకటేష్, రాజేష్, రామిరెడ్డి, జాకీర్ పాల్గొన్నారు.

రాజధాని అమరావతిలో చంద్రబాబు శవయాత్ర,

తాడికొండ: రాజధానిలో పేదలకు అందించే ఇళ్ల స్థలాలను చంద్రబాబు సమాధులు, శవాలతో పోల్చడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజధానిలో బాబు దిష్టిబొమ్మకు శవయాత్ర, అంతిమ సంస్కారం నిర్వహించారు. తుళ్లూరు మండలం మల్కాపురం జంక్షన్ నుంచి ప్రారంభమైన ఈ శవయాత్రలో చంద్రబాబు శవాన్ని పాడెపై ఉంచి మోస్తుండగా రామోజీ, రాధాకృష్ణ, చంద్రబాబు మాస్కులు ధరించి శవయాత్రలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శృంగారపాటి సందీప్ కుండ భుజాన పెట్టుకొని వెలగపూడి వరకు మోసుకెళ్లి సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల వైఎఎస్సార్‌సీపీ నాయకులు కొప్పుల శేషగిరిరావు, తుమ్మూరు రమణారెడ్డి, తోకల రాఘవ, ఆరేపల్లి జోజి, నేలపాటి నాగేంద్ర, చలివేంద్రం సురేష్, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ఎనలేనివి

ఫిరంగిపురం: వలంటీర్ల సేవలు ఎనలేనివని పలువురు నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఉత్తమసేవలు అందించినందుకు అవార్డులు అందుకున్న వలంటీర్లకు సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం-1కు చెందిన రావుల స్వప్నకు సేవా వజ్ర అవార్డు, పాతాలం వెంకట పద్మావతికి సేవా రత్న, తక్కెళ్లపాడుకు చెందిన విజయలక్ష్మికి సేవా రత్న అవార్డులను జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలానర్గీస్, సర్పంచ్ మేడా బాబులు అందజేశారు. ఎంపీడీవో డి.అనూరాధ మాట్లాడుతూ మండలంలో 107 మంది సేవామిత్ర అవార్డులకు ఎంపికయ్యారని చెప్పారు. కార్యక్రమంలో మార్పుల శివరామిరెడ్డి, గుమ్మడి చంద్రం, ఎం.విజయలక్ష్మి, శాంతమ్మ, రూతు, ఈవో శ్రీనివాసరావు, సిబ్బంది, మండల నాయకులు పాల్గొన్నారు.



ఈమని గ్రామంలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు

వలంటీర్లకు సన్మానం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం ఈమని గ్రామంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో వలంటీర్లకు సోమవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ వలంటీర్లను సన్మానించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వలంటీర్ల సేవలను గుర్తించి ప్రభుత్వం వారిని ప్రోత్సహించే విధంగా ప్రశంసాపత్రాలతోపాటు నగదును అందజేస్తోందని తెలిపారు. ఈమని గ్రామంలో 1,2 సచివాలయాల్లో 49 మంది వలంటీర్లు ఉండగా ప్రతి ఒక్కరికి సేవామిత్ర అవార్డు దక్కిందని, వారందరిని సన్మానించడం ఎంతో సంతోషించదగ్గ విషయమని అన్నారు. అనంతరం ప్రభుత్వం అందజేసిన ప్రశంసాపత్రాలతోపాటు రూ.10 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సెక్రటరి సతీష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

తాతిరెడ్డిపాలెం(తాడికొండ:): తాడికొండ మండలం తాతిరెడ్డిపాలెం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ చొరవ తీసుకున్నారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు తాతిరెడ్డిపాలెం గ్రామంలో జెడ్పీ నిధులతో ఏర్పాటు చేయనున్న బోరుపంపు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించి బోర్లు నిర్మాణం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి రాజు, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్ల శ్రీనివాసరెడ్డి, స్థానిక నాయకులు కొండా శ్రీనివాసరెడ్డి, షేక్ మీర్జావలి, నూర్జహాన్, సలీమ్, కొండా నవీన్‌రెడ్డి, కొండా కిషోర్‌రెడ్డి, రాయపూడి రంగారావు, రావూరి నరేష్, అలీ పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్లు అరెస్టు

మేడికొండూరు: మండలంలోని పాలడుగు గ్రామంలో సోమవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. గ్రామస్తుల సమాచారం మేరకు సీఐ వాసుకు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై మధుపవన్, సిబ్బందితో కలిసి దాడి చేసి ఎనిమిది మంది పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 5,260 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీపీఎం సీనియర్ నేత సాంబశివరావు మృతి



తెనాలిటౌన్: సీపీఎం సీనియర్ నాయకుడు వల్లభనేని సాంబశివరావు (72) అకాల మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఆ పార్టీ నాయకులు కె.బాబుప్రసాద్, ములకా శివసాంబిరెడ్డి, షేక్ హుస్సేన్‌వలీ సంతాపం వ్యక్తం చేశారు. సాంబ శివరావు సోమవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందినట్లు వారు తెలిపారు. దుగ్గిరాల మండలం తుమ్మపూడి గ్రామానికి చెందిన సాంబశివరావు 1969లో పార్టీ రాష్ట్ర రాజకీయ పాఠశాల చిలువూరులో జరిగిన సందర్భంలో వలంటీర్‌గా పనిచేశారని తెలిపారు. 1971లో యువజన సంఘం గ్రామ కార్యదర్శిగా, 1973 నుంచి తాలూకా యువజన సంఘం కార్యదర్శి నుంచి వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేశారని తెలిపారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యునిగా, తెనాలి కార్యదర్శిగా ఆయన చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. మంగళవారం సాంబశివరావు స్వగ్రామం తుమ్మపూడిలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఆయన మృతి పట్ల జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి, షేక్ అహ్మద్ హుస్సేన్, పోస్టల్ నాయకులు పి.జోసేష్, మహిళా సంఘం కార్యదర్శి ఎస్.రాజ్యలక్ష్మి సంతాపం వ్యక్తం చేశారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

జగనన్న పాలనలో అన్ని వర్గాలు సంతోషం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త సురేష్‌కుమార్
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న కత్తెర సురేష్‌కుమార్

తాడికొండ: జగనన్న పాలనలో పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. సోమవారం తాడికొండ-3 సచివాలయం పరిధిలోని జెండాచెట్టు, రజకవీధి ప్రాంతంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ద్వారా కుటుంబానికి జరిగిన లబ్ధిని వివరించి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య భారత దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయలేని సంక్షేమ పథకాలను పేదవాడి చెంతకు చేర్చి ప్రతి అడుగులో అడుగై నడిచిన జగనన్నకు ప్రజల మద్దతు ఎప్పటికీ ఉంటుందన్నారు. కులం, మతం, ప్రాంతం పార్టీ భేదం లేకుండా సంక్షేమ పథకాలను అందించిన జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ జరిగిన లబ్ధిని వివరిస్తుంటే ప్రజలు భావోద్వేగానికి గురై సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఒక గ్రామంలో పట్టుమని 10 మంది పేదలకు కూడా ఇంటి స్థలం ఇవ్వలేదని, అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 35 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి వారికి సొంతింటి కల నిజం చేస్తున్న జగనన్న పాలన దేశానికే ఆదర్శం అన్నారు. రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా తప్పుడు కేసులతో అడ్డుకోవాలని చూసిన చంద్రబాబు, ఆయన అనునాయులకు సుప్రీంకోర్టు మొట్టికాయలు వేయడం హర్షణీయమని, ఇకనైనా బాబు తన దుర్మార్గ వైఖరి మానుకొని పేదలకు మేలు చేయాలి తప్ప కీడు చేయవద్దని హితవు పలికారు. ఈ నెల 26న రాజధానిలో పేదల పట్టాల పండుగ జరగనుందని, పేద వర్గాలకు అండగా నిలుస్తూ అన్ని విధాలా ఆదుకుంటున్న జగనన్న రాబోయే ఎన్నికల్లో 175/175 సీట్లు సాధించి బాబును ఇంటికి పంపించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తోకల సరోజినీ, కంతేరు సర్పంచ్ బెజ్జం మహేష్ బాబు, మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు, రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లంపాటి రాఘవరెడ్డి,జిల్లా ఎస్సీ సెల్ ప్రధానకార్యదర్శి తోకల నరసింహారావు, బీసీ సెల్ నాయకులు పసుపులేటి వెంకట్రావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోడపాటి ధర్మరాజు, తాళ్ల శివనాగరాజు ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలు పథకానికి గురుకుల విద్యార్థి ఎంపిక



డి శివశంకర్ నాయక్, విద్యార్థి

తాడికొండ: ప్రభుత్వ పాఠశాలల పరిధిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పథకం కింద అందించే ప్రతిభా అవార్డుకు తాడికొండ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి డి శివశంకర్ నాయక్ ఎంపికయ్యాడు. ఈ ఏడాది నిర్వహించిన పబ్లిక్ పరీక్షలలో 600 మార్కులకుగాను 548 మార్కులు సాధించి జిల్లాలో మూడో స్థానంలో నిలిచినందుకుగాను విద్యార్థి డి శివశంకర్ నాయక్‌కు ఈ పురస్కారం వరించింది. ఈ నెల 27న గుంటూరు జిల్లా కేంద్రంలో నిర్వహించబోయే జగనన్న ఆణిముత్యాలు అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గారి చేతుల మీదుగా రూ.15 వేల నగదు, సర్టిఫికెట్ అందుకోనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎంబీడీ శ్యామల తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థిని ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

'స్పందన'తో సమస్యలకు పరిష్కారం



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీఓ పార్థసారథి

రేపల్లె: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి పేర్కొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొని, అర్జీలు స్వీకరించారు. కుల ధృవీకరణ పత్రానికి 2, రోడ్డు సర్వే చూపించాల్సిందిగా 2, ఫిషరీస్ సొసైటీ ఎన్నికల నిర్వహణకు 1, అండగల్ పేర్లు తొలగించాలని 1, ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించాలని 1, ఎంకరేట్‌మెంట్ ఆఫ్ ఇరిగేషన్ కెనాల్ సర్వే చేయించాలని కోరుతూ 1 చొప్పున అర్జీలు అందాయని తెలిపారు. అర్జీలను పరిశీలించి పరిష్కరించటం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రూ.1.67 కోట్లతో యర్రబాలెం సీసీ రోడ్డు విస్తరణ



రహదారి విస్తరణ పనుల్లో భాగంగా మట్టిని తీస్తున్న పొక్లెయిన్

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే దాదాపు 70కిపైగా అంతర్గత రహదారుల నిర్మాణ పనులు పూర్తి కాగా తాజాగా రూ.1.67 కోట్ల నిధులతో చేపట్టిన సీసీ రహదారి విస్తరణ పనులకు సోమవారం నగర పాలక సంస్థ అధికారులు శ్రీకారం చుట్టారు. యర్రబాలెం పారిశ్రామికవాడలోని శ్రీ కృష్ణానందాశ్రమం వద్ద నుంచి శ్రీ లక్ష్మీ సూర్య ఎస్టేట్స్ సమీపంలోని డిలైట్ దాబా హోటల్ వరకు విస్తరించనున్నారు. పారిశ్రామికవాడలో ఉన్న పలు పరిశ్రమలకు ముడి సరుకు, తయారైన ఉత్పత్తులను తరలించేందుకు ఈ మార్గంలోనే లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక విజయవాడ నుంచి యర్రబాలెం, పెనుమాక, కృష్ణాయపాలెంకు రాకపోకలు సాగించే వాహనదారులు ఇదే మార్గంలో నిత్యం ప్రయాణిస్తుంటారు. ఈ నేపథ్యంలో రహదారి మార్గాన్ని విస్తరించి తమ ఇబ్బందులను తీర్చాలని పలువురు పరిశ్రమల యజమానులు, స్థానిక ప్రజలు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన రహదారి విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. యర్రబాలెం రామాలయం వద్ద నుంచి పారిశ్రామికవాడలోని శ్రీకృష్ణానంద ఆశ్రమం వరకు సుమారు రూ.1.80 కోట్లతో బీటీ రహదారి నిర్మాణంతోపాటు శ్రీ కృష్ణానంద ఆశ్రమం నుంచి శ్రీ లక్ష్మీ సూర్య ఎస్టేట్స్ వరకు సుమారు రూ.1.67 కోట్లతో సీసీ రహదారి విస్తరణ పనులు చేపట్టాలని నిర్ణయించిన నగరపాలక సంస్థ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయగా ఎమ్మెల్యే ఆర్కే అందుకు అవసరమైన నిధులు కేటాయించారు. ఈ నేపథ్యంలో తొలి విడతగా సీసీ రహదారి విస్తరణ పనులకు శ్రీకారం చుట్టగా రెండో విడతగా బీటీ రహదారి నిర్మాణాన్ని చేపట్టనున్నారు. గత కొన్నేళ్లుగా ఎదుర్కొంటున్న రహదారి సమస్య ఇన్నేళ్లకు తీరనుండటంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

గుండెపోటుతో వెల్ఫేర్ సెక్రటరీ మృతి



గుమ్మడి చంద్రశేఖర్ (ఫైల్)

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని పెదవడ్లపూడి-3 సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ గుమ్మడి చంద్రశేఖర్ (37) విధి నిర్వహణలో గుండెపోటుకు గురై మృతి చెందారు. ఆయనకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. కార్పొరేషన్ పరిధిలోని పెదవడ్లపూడిలో నివాసం ఉంటున్న చంద్రశేఖర్ ప్రతి రోజూ మాదిరి సోమవారం ఉదయం 10 గంటలకు విధి నిర్వహణ నిమిత్తం సచివాలయానికి హాజరయ్యారు. ఈనెల 26వ తేదీన తుళ్లూరు మండలం వెంకటపాలెంలో జరిగే ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి లబ్ధిదారులను ఆహ్వానించాలనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సచివాలయం నుంచి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లేందుకు బయలుదేరాడు. ఒక్కసారిగా గుండెపోటుకు గురై రోడ్డుపైనే కుప్పకూలిపోయాడు. స్థానికులు 108 వాహనంలో చినకాకాని ఎన్నారై వైద్యశాలకు తరలించారు. మార్గం మధ్యలోనే చంద్రశేఖర్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

స్వగ్రామానికి భౌతికకాయం తరలింపు

గుండెపోటుకు గురై మృతి చెందిన వెల్ఫేర్ సెక్రటరీ గుమ్మడి చంద్రశేఖర్ భౌతిక కాయాన్ని ఆయన స్వగ్రామమైన పెదకూరపాడుకు తరలించారు. అంతకు ముందు ఎన్నారై వద్ద చంద్రశేఖర్ భౌతికకాయాన్ని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా సెక్రటరీ షేక్ ఆయూబ్, రామారావులతోపాటు పలువురు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది సందర్శించి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. చంద్రశేఖర్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని రెవెన్యూ అధికారుల సంఘం నేతలు హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే ఆర్కే సంతాపం

కార్పొరేషన్ పరిధిలోని పెదవడ్లపూడి-3 సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ గుమ్మడి చంద్రశేఖర్ ఆకస్మిక మృతిపట్ల ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈమేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విధి నిర్వహణలో ఉన్న వెల్ఫేర్ సెక్రటరీ గుండెపోటుకు గురై ఆకస్మికంగా మృతి చెందడం బాధాకరమని తెలిపారు. చంద్రశేఖర్ ఆత్మకు శాంతి చేకూర్చాలని మనస్ఫూర్తిగా ఆ భగవంతుడిని కోరుకుంటూ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

జూనియర్ కళాశాలలో అధ్యాపకుల నియామకం



వడ్డేశ్వరం జూనియర్ కళాశాలకు నూతనంగా నియమితులైన లెక్చరర్లు

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి రూరల్, వడ్డేశ్వరం, దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని గ్రామాలలో ఉన్న జూనియర్ కళాశాలలకు ప్రభుత్వం ఉపాధ్యాయులను నియమించింది. సోమవారం ఆ ఉపాధ్యాయులు బాధ్యతలు స్వీకరించారు. వడ్డేశ్వరం జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఉన్న జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా బి.శ్రీదేవి, ఇంగ్లీష్ లెక్చరర్‌గా కె.శ్రీరామచంద్రారెడ్డి, ఫిజిక్స్ లెక్చరర్‌గా సీహెచ్.వెంకటేశ్వరరావు, కెమిస్ట్రీ అధ్యాపకులుగా ఇ.ఆనందరావు, జువాలజీ అధ్యాపకులుగా ఎం.అరుణ, బాటనీ లెక్చరర్‌గా వై.లక్ష్మీ ప్రసన్నలు బాధ్యతలు స్వీకరించారు. ఈమని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఇంటర్మీడియట్ బోధన కోసం మాథమెటిక్స్ లెక్చరర్‌గా వి.శర్వాణి, ఫిజిక్స్ లెక్చరర్‌గా కె.డేవిడ్, కెమిస్ట్రీ లెక్చరర్‌గా జె.వెంకట సుబ్బారావు, సివిక్స్ లెక్చరర్‌గా డి.శివనాగమణి, ఎకనామిక్స్ లెక్చరర్‌గా వి.కనకదుర్గ, కామర్స్ లెక్చరర్‌గా ఎం.సురేష్‌కుమార్, తెలుగు లెక్చరర్‌గా సీహెచ్ లక్ష్మణ్‌కుమార్, ఇంగ్లీష్ లెక్చరర్‌గా ఎస్.చంద్రశేఖర్‌లు విధుల్లో చేరారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక



నూతనంగా కార్యవర్గ సభ్యులతో జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా

ఫిరంగిపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఫిరంగిపురం యూనిట్ కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. నూతనంగా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వాన్ని ఎప్పుడూ ప్రశ్నిస్తుంటామని చెప్పారు. ఫిరంగిపురం యూనిట్ అధ్యక్షుడు టి.రాజబాబు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలే ప్రధాన ఎజెండాగా పనిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మురళి, కార్యదర్శి షేక్.అలి, ట్రెజరర్ టి.లూర్దురాజు, సహఅధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షులు టి.హేమలత, శౌరిజోజి, సంయుక్త కార్యదర్శులుగా అరుణభారతి, సూర్యనారాయణ, ప్రకాష్‌లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి ఉత్సవాలు



ఆలయంలో సీతారాముల కల్యాణం

తెనాలిటౌన్: షరాఫ్ బజార్‌లోని సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా చేశారు. వంశపారంపర్య అర్చకులు ఆర్.శ్రీనివాసమూర్తి నేతృత్వంలో వైదిక క్రతువును పండితులు, అర్చకులు కిరణ్, సురేష్‌లు జరిపారు. తెలుగు పండితులు ములుకుట్ల విశ్వనాథశర్మ ప్రవచనం చేయగా, సంకీర్తన బృందం సభ్యులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ, కార్యనిర్వాహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, సేవా సమితి అధ్యక్షులు మూర్తి వెంకటేశ్వరరావు, గుడివాడ బాలకృష్ణ, జంధ్యా రామారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రామచంద్రస్వామి పట్టాభిషేక మహోత్సవాలు

పిట్టలవానిపాలెం: పిట్టలవానిపాలెంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానంలో పట్టాభిషేక మహోత్సవాలు ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు బృందావనం శ్రీనివాసాచార్యులు, బృందావనం గోపీచంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న విశ్వక్సేన పూజ, పుణ్యాహ వచనం, 24న 108 కలశాలతో జ్యేష్టాభిషేక మహోత్సవం, 25న ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం 12.45గంటలకు సీతారామచంద్రస్వామికి పట్టాభిషేక మహోత్సవం, అనంతరం పుష్పయాగం నిర్వహించనున్నట్లు తెలిపారు.

'సొసైటీ'లో అవకతవకల ఆరోపణలపై విచారణ

బాపట్ల: బాపట్ల పట్టణంలోని దగ్గుమల్లివారిపాలెం ఆది ఆంధ్ర కో-ఆపరేటివ్ కలెక్టింగ్ ఫార్మింగ్ సొసైటీలో అవకతవకలపై విచారణ ప్రారంభమైంది. తహసీల్దార్ సుధారాణి సోమవారం విచారణ చేపట్టారు. ఫిర్యాదు దారుడు దగ్గుమల్లి ధర్మరావుతోపాటు మిగిలిన సభ్యులు విచారణలో పాల్గొన్నారు. తమ వద్ద ఉన్న ఆధారాలను తహసీల్దార్‌కు వివరించారు. కమిటీ సభ్యులు అడే రవికుమార్, యాతం మోజేస్‌రాజు తదితరులు పాల్గొన్నారు.